# అవిటి ప్రాణి

"మమ్మీ! తొందరగా రావాలి" దొడ్లోంచి గట్టిగా పిల్చాడు మురళి.

"ఏమిట్రా?" ఇంట్లోంచే బిగ్గరగా అంది వాసంతి.

"ఓసారిలా రామ్మా!" వాడి గొంతులో కంగారు.

"నేలా రాన్రా!" వాసంతి గొంతు సన్నగా వణికింది.

అప్పుడు గుర్తొచ్చింది మురళికి తల్లి లేవలేదని. గభాల్న తల్లి దగ్గరికొచ్చి-

"సారీ మమ్మీ! మర్చిపోయి పిల్చాను" అన్నాడు మురళి నొచ్చుకుంటూ.

"ఫరవాలేదులే! యేమిటి యెందుకు పిల్చావ్?" నవ్వు తెచ్చుకుంటూ అంది వాసంతి.

"మరేం లేదమ్మా! ఓ కాకి కాలుకి దెబ్బతగిలినట్టుంది. పాపం! కుంటుకుంటూ మెతుకుల్ని ఏరుకు తింటోంది" జాలిగా అన్నాడు మురళి.

తృళ్ళిపడింది వాసంతి.

"అయ్యో! ఎలా తగిలిందిరా?" అంది అదుర్దాగా.

"ఏమోనమ్మా తెలియదు! ఎవరయినా కొట్టారేమో"

"బాగా తగిలిందా? నెత్తురొస్తోందా?" కంగారుగా అంది వాసంతి.

"ఆ! తగిలినట్టే వుంది. అసలు కాలు కింద పెట్టలేక పోతోంది.

"అయ్యో!" అంటూ ఆ దెబ్బ తనకే తగిలినట్టు తెగ బాధపడిపోయింది వాసంతి.

అదే మరొకప్పుడయితే ఈ విషయాన్ని తేలిగ్గా తీసి పారేసేది. కానీ...యిప్పుడామె అలా అనుకోలేక. కారణం.

రెండు నెలలక్రితం ఆమె మేడ ఎక్కుతూ కాలు స్లిప్పయి పడిపోయింది.

కాలు ఫ్రాక్చరయింది!

అప్పట్నించీ పిండికట్టుతో అలా మంచంమీదే వుండి పోయింది.

మానసికంగా చాలా కృంగిపోయింది.

మంచంలో ఉన్న ఆమెకి ఆలోచనలు ముసిరి తెగ భయపెట్టేశాయి.

మనిషి నిస్సహాయ స్థితిలో ఎలా వుంటాడో అనుభవ పూర్వకంగా తెలుసుకుంది.

అందుకే యే ప్రాణి బాధపడుతున్నా ఆమె చూడలేదు. చూచి భరించలేదు.

అందుకే కాకి సంగతి వినగానే గిలగిల్లాడిపోయింది.

కాకిని గురించి పదేపదే అడిగింది కొడుకుని.

భర్త, పిల్లలు ఆమెని ఎంతో అపురూపంగా చూసుకుంటున్నా మంచంలో వుండడం నరకప్రాయంగానే వుందామెకి.

మరో నాలుగు రోజుల్లో కట్లు విప్పతానన్నారు డాక్టర్ గారు.

ఆ నాలుగు రోజులూ మరీ యుగాలుగా తోచాయి వాసంతికి. ఒక్కసారి కాకిని చూడాలని మహా ఆరాటంగా వుందామెకి.

అనుకున్న రోజునే వాసంతి కాలు కట్టు విప్పారు.

పసిపాపకి నడక నేర్పుతూ, ఆ పాప మెల్లగా అడుగు లేస్తుంటే మురిసిపోతూ చూసే తల్లిలా చూస్తున్నారామె కేసి భర్త, పిల్లలు.

తలమీదినుంచి పదిటన్నుల బరువు దించినట్లయింది వాసంతికి.

ఆ వెంటనే కాకిని చూసింది.

ఆ కాకికాలు దాదాపు శిథిలావస్థలో వుంది.

"ఏం జబ్బో! లేకపోతే ఏ తుంటరి వెధవో రాయి పెట్టి కొట్టి వుంటాడు! అది సెప్టిక్ అయి వుంటుంది. అయితే పాపం దానికి కట్టెవరు కడతారు? అసలు వాటిలో డాక్టర్లుంటారా?" తన పసి ఆలోచనలకి తనే నవ్వుకుంది వాసంతి.

మర్నాడు కాకికాలు మరీ పాడైపోయింది. బాధవల్ల కాబోలు ఓ మూల వొదిగొదిగి నిల్చుంది.

క్రమేపీ దాని కాలు క్షీణించి ఓ రోజున పూర్తిగా ఊడిపోయింది.

ఓ కాలు లేని బాధతో మూగగా రోదిస్తూ ఓ పక్కగా

ముడుచుకూర్చున్న ఆ కాకిని చూసి తల్లడిల్లిపోయింది వాసంతి.

కానీ...తానేం చెయ్యగలదు? బాధ తగ్గింది కాబోలు మరో రోజు తర్వాత మెల్లగా మెతుకులు యేరుకు తినడానికి ప్రయత్నించింది ఆ కాకి. కాని మిగతా కాకులు దాన్ని చేర నివ్వలేదు.

అలాగే పనిమనిషి పడేసిన అంట్లలోని మెతుకులు ఏరుకు తింటూ, మిగతా కాకులు తరుముతూంటే, భయంతో పక్కకి తప్పుకుంటూ, దూరంనించే ఆ మెతుకులకేసి ఆశగా చూస్తూ ఒదిగొదిగి వుండే ఆ కాకిని చూస్తూంటే వాసంతి కళ్ళు నీళ్ళతో నిండిపోయేవి.

ఓసారి మెల్లగా కాస్త ఇడ్లీముక్క తుంచి దానిముందు పడేసింది వాసంతి.

ఆకలితో, ఆనందంగా అందుకోబోయిన ఆ కుంటికాకిని తరిమేసి మరోకాకి దాన్ని నోట కరుచుకుపోయింది.

ఎవరో, ఎప్పుడో కులాభిమానం వున్నవాళ్ళని కాకులతో పోల్చడం గుర్తొచ్చి, అందులో యెంత నిజంవుందో చూసి మరీ తెలుసుకుంది వాసంతి.

"అంతా అబద్ధం!"

మనిషికి ధనమే కొండంత బలం! కానీ జంతువులకీ, ఇలాంటి ప్రాణులకీ శారీరక బలమే ముఖ్యం!

బలవంతులదే రాజ్యం!

భారంగా నిట్టూర్చింది వాసంతి.

ఆ రోజునుంచీ కాకి ఒంటరిగా ఉన్న సమయం చూసి జాగ్రత్తగా ఆహారం వెయ్యడం మొదలుపెట్టింది.

కొన్నాళ్ళకి ఆ కాకికి కాస్త ధైర్యం వచ్చినట్టుంది. నిర్భయంగా లోపలికి రావడం ప్రారంభించింది.

అంతేకాదు. కుంటికాలిమీద ఆమెకున్న అభిమానం మిగతావి కనిపెట్టినట్టున్నాయి. అవికూడా ఆ కుంటికాకిని అంటిపెట్టుకుని మరీ వుండడం మొదలుపెట్టాయి.

అయినా ఎలాగో తెలివిగా ఆ కుంటికాకికి మాత్రమే ఆహారం వేస్తూ దాన్ని బ్రతికిస్తోంది వాసంతి.

అనుకోకుండా ఊరెళ్ళిన వాసంతి పదిరోజుల తర్వాత తిరిగి వచ్చింది.

హఠాత్తుగా ఆమెకి కాకి గుర్తొచ్చింది! గుండె ఝల్లుమంది.

కంగారుగా పెరడంతా వెతికింది.

ఆ కాకి కనిపించలేదు.

ఏమైంది? ఈ పదిరోజులూ దానికి తిండెలా దొరికింది? ఎవరు పెడతారు. ఒకవేళ తిండిలేక...అమ్మో!...అలా వూహిస్తేనే ఆమె మనసంతా అదోలా అయిపోయింది.

తను కనిపించగానే...ఒంటికాలితో కుంటుకుంటూ దగ్గరకు వచ్చే ఆ కాకి కనిపించకపోయేసరికి వాసంతికి పిచ్చిపట్టినట్టుగా అయిపోయింది.

"మంగీ!...ఆ కాకిని చూశావుటే ?" అంది పనిమనిషితో.

"లేదమ్మా!" ముభావంగా అనేసి చీపురు చేతిలోకి తీసుకుని ఊడవడం మొదలుపెట్టింది మంగి.

"యేమయిందో యేమిటో కాస్త మేంలేని ఈ నాలుగు రోజులు దానికాస్త తిండి పడెయ్యకూడదుటే?" అంటూ విసుక్కుంది వాసంతి.

"నేనూ వన్లోకిరా నేదమ్మా."

"యేమిటే నువ్వు రా లేదా? అంటే మేం లేనన్నాళ్లా వీధిలో ముగ్గెయ్యలేదా? కోపంగా అంది వాసంతి.

మంగి మాట్లాడ లేదు.

"ఎంత నిర్లక్ష్యం, అడిగేది నిన్నేనే" కాకి కనిపించ లేదన్న కోపం మంగి మీాద చూపించింది వాసంతి.

"మొన్న మనం వెళ్ళే రోజు మంగికి జ్వరంగా వుంది కదమ్మా, ఎక్కువయిందేమో!" అన్నాడు మురళీ.

వాసంతి పరీక్షగా చూసింది మంగి కేసి.

నిజంగా మంగి నీరసించి పోయివుంది. క్షణం జాలిపడింది. కానీ బింకంగా.

"ఊ!... యెప్పుడూ రోగాలే అదేమంటే. కూాపీ ప్రాణాలే అంటూ వెధవ సినిమా డైలాగులు" రుసరుసలాడుతూ అంట్లు పడేసింది.

మంగి మౌనంగా అంట్లు ముందు కూర్చుని తోవడం మొదలు పెట్టింది.

ఇంతలో పక్క తోటలో బోలెడు కాకులు గోలగా అరవడం వినిపించింది.

వాసంతి తృళ్ళి పడింది.

"మంగీ అక్కడేదో కాకులరుస్తున్నట్టున్నాయి. చూడు." అంది కంగారుగా.

మంగి లేచి వెళ్ళింది.

ఇంతలో పక్కింటి పాప పరుగెత్తుకొచ్చింది. "అంటే, మా దొడ్లో ఓ కాకి చచ్చిపోయింది పాపం! దాని చుట్టాలు కాబోలు తెగ యేడుస్తున్నాయి!" అంటూ.

వాసంతి గుండె ఝల్లుమంది.

పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది.

"అవును! మరి, ఇన్నాళ్ళు తిండిలేకపోతే యెలా బతుకు తుంది? పాపిష్టిదాన్ని యెవరికయినా చెప్పయినా వెళ్ళాను కాదు. నాలుగు మెతుకులు పడెయ్యమని.

అయినా ఆ వెధవ కాకులు మాత్రం? బతికున్నన్నాళ్లు దాన్ని ఒంటరిదాన్నిచేసి దూరంగా తరిమేశాయ్. ఇప్పుడు యేడుస్తున్నాయి.

తనని, కాకుల్ని కూడా తిడుతూ అలా నిల్చుండి పోయింది వాసంతి.

"ఏమిటే వసూ, ఇక్కడ నిల్చున్నావేమిటి? నీ కాకి ఫ్రెండ్ కనిపించలేదా? అంటూ ఆమె భర్త రామం వచ్చాడు.

భర్తమాటలకి, మరీ దుఃఖం పెరిగి ఒక్కసారి చేతుల్లో ముఖాన్ని దాచుకుని భోరుమంది వాసంతి.

"ఏమిటి? ఏమయింది? కంగారుపడి పోయాడు రామం.

"మన మన కుంటి కాకి, చచ్చిపోయిందండీ!" ఏడు స్తూనే అంది వాసంతి.

"ఓస్! దానికేనా? నేనింకేదో అనుకుని కంగారు పడ్డాను." తేలిగ్గా అనేశాడు రామం. అతని మాటలకి తెల్ల బోయిన వాసంతి కోపంగా ఏదో అనబోయింది.

ఇంతలో—

"కావ్! కావ్! అన్న సుపరిచిత స్వరం వినిపించి తృళ్ళి పడిచూసింది.

అవును!...ఆకాకే.

తను ప్రేమించే ఆ కుంటి కాకే.

వాసంతి ముఖంలో చెప్పలేనంత వెలుగు.

ఆమెకి ఆకాకి అరుపు తియ్యని వేణు నాదంలా తోచింది.

"అబ్బ నన్ను చూసి దాని ముఖంలో ఎంత ఆనందం." అనుకుని మురిసిపోయింది.

"ఏమండీ! ఆ చచ్చిపోయింది మనకాకి కాదు. అదేదో వేరేకాకి." ఆ ఆనందలో భర్త మీద కోపంగానీ, ఆ కాకిని భర్తకూడా చూస్తూన్నాడనిగానీ గుర్తు రాలేదు వాసంతికి.

గబ గబా లోపలికెళ్ళి తినడానికేదో తెచ్చి దాని ముందు పడేసి, అది కుంటుతూ ఏరుకుని తింటూంటే,

మిగతా కాకులు రాకుండా చూస్తూ అదోలాంటి తన్మయావస్థలో పడిపోయింది.

ఆమె చర్యని జాగ్రత్తగా గమనిస్తున్న రామం వస్తూ, ఒక్క మాటడుగుతాను, కోపం తెచ్చుకోవుగా”? అన్నాడు మెల్లగా.

“ఊహూ! అడగండి. నవ్వుతూ అంది వాసంతి. ఈ కుంటి కాకి మీద నీ కెందుకింత మమకారం?”

బావుంది, ఇదో ప్రశ్న? అడిగారు కాబట్టి చెపుతున్నాను. పాపం, అది కుంటి కాకి. తనంతట తానుగా తిండి సంపాయించుకోలేదు. అందుకే నాలుగు మెతుకులు వేస్తున్నాను. అవి తిని అది బ్రతుకుతోంది. తేలిగ్గా అంది వాసంతి.

“ఆ కుంటికాలితో అది బ్రతికి ప్రయోజనం యేమిటి? అలా బ్రతికి ఎవర్ని వుద్ధరించాలి? ఇలాంటి అవిటి జీవాలు బతికేకంటే ఛస్తే సుఖంకదూ?” అన్నాడు రామం.

నిర్ఘాంతపోయింది వాసంతి.

“మీర నేది...” తడాఁన గొంతుతో యేదో అనబోయింది.

“అయాంసారీ! ఏది మాట్లాడినా కాస్త దూరం ఆలోచించి మాట్లాడాలి వాసంతీ.”

మెల్లగా అనేసి లోనికెళ్ళిపోయాడు రామం.

వాసంతి ముఖం కత్తివేటుకు నెత్తురుబొట్టు లేనంతగా పాలిపోయింది.

గతం ఆమె కళ్ళముందు వికటాట్టహాసం చేసింది.

* * *

మంగికి మూడేళ్ళక్రితం ఓ కొడుకు పుట్టాడు. వాడికి పుట్టుకతోనే రెండు కాళ్ళూ వ్రేలాడిపోయాయి. ఇప్పటికీ నెలల పిల్లాడిలానే ఎప్పుడూ పడుకునే వుంటాడు. ఎదుగు, బొదుగు లేదు.

వాణ్ణి చూసిన వాసంతి ఒళ్ళు జలదరించింది.

మొదట్లో మంగి వాడ్నికూడా తనతో తెచ్చుకుని ఓ మూలగా పడుకోబెట్టి తన పన్లు చేసుకుని మళ్ళీ వెళ్ళేటప్పుడు తీసుకుపోయేది.

పైగా వాడికెప్పుడూ రోగాలే!

వాడు పుట్టిందగ్గర్నించీ మంగికి కష్టాలే.

ఒకచోట స్థిరంగా పని చేసుకోనిచ్చేవాడుకాదు. తల్లి కనుమరుగయితే రాగం మొదలుపెట్టేవాడు.

ఇదంతా మొదట్లో సహించినా రానురాను వాసంతికి చిరాకు ఎక్కువైపోతోంది!

వాణ్ణి చూస్తేనే కంపరంగా వుందామెకి.

కారణం వాడి మూలంగా మంగి నాగాలు పెడు తోంది.

అంట్లు సరిగ్గా తోమడమే లేదు! బట్టలు సరేసరి.

వచ్చిందగ్గర్నించీ ఉరుకులు.

మధ్య మధ్య ఆ కుంటి కొడుకుతో ముచ్చట్లు! ఇవన్నీ సహించలేకపోయింది వాసంతి.

మంగిని అనవసరంగా తిట్టడం, కొడుకుని ముద్దు పెట్టు కుంటున్న మంగిని చూసి అసహ్యించుకోవడం మొదలు పెట్టింది.

మంగి అర్థంచేసుకుంది యజమానురాల్ని...అందుకే పసివాణ్ణి ఇంటిదగ్గరేవుంచి ఇరుగమ్మ పొరుగమ్మతో చెప్పి పని చేసుకుని వెళ్ళడం మొదలుపెట్టింది.

అయితే ఇది మరీ చిరాగ్గావుంది వాసంతికి.

వచ్చిందగ్గర్నించీ వెడతానన్న హడావిడి ఎక్కువై పోయిందని విసుక్కుంది.

"అన్నంగిన్నెల్నిండా మెతుకులే!" అని మండిపడింది.

"ఎక్కడ పాచి అక్కడే! ఇదేం ఊడ్పు" అంటూ నిలదీసింది.

"అలా పనుగుపెడితే మరో మనిషిని చూసుకోవా ల్సొస్తుంది." అంటూ హెచ్చరించింది.

భర్తయేదో అనబోతే_

"పనిమనిషి విషయంలో అసహ్యంగా మీరు తల దూర్చకండి" అంటూ మండిపడింది.

అయితే ఎన్నిచేసినా మంగిని మాత్రం పని మాన్పిం చలేదు.

ఆమెకి తెలుసు ఈరోజుల్లో పనిమనుషులెలా వున్నారో.

దొంగతనంలేని, మాటమరుసుతనంలేని మంగిని వదులు కునేంతటి పిచ్చిదికాదు వాసంతి.

ఈమధ్య మంగి మరీ నాగాలు పెట్టేస్తోంది. అదేమంటే ప్రాణం బాగాలేదు అంటుంది.

"ఎక్కడలేని డబ్బు ఆ కుంటి కొడుక్కి మందులిప్పించ డానికే చాలదు." అని విసుక్కుంది ఓసారి మంగి డబ్బడిగితే.

మరోసారి యెవరో స్పెషలిస్టు వచ్చాడంటూ పట్టాలు తాకట్టు పెట్టి కొడుకును తీసికెళ్తున్న మంగిని మంద లించింది వాసంతి.

"ఎందుకే మంగీ! ఈ వెధవకోసం నెత్తురోడ్చి సంపా దించిన డబ్బు ఇలా తగలేస్తావ్? ఏనాటికయినా వీడు బాగు పడతాడా? కాళ్ళు ఇంక రావని హాస్పటల్లో చెప్పనే చెప్పా రామె! ఇలాంటివాళ్ళు బ్రతికి ఎవర్ని వుద్ధరించాలి. బతికున్న వాళ్ళని చంపడానికాక పోతే!" అనేసింది. అది మంగిమీాద జాలో, లేక తన పన్లకి ఇబ్బంది రావడంవల్ల కలిగిన చిరాకో సరిగ్గా చెప్పడం కష్టం.

ఆమె మాటలకి మంగి, ఇంట్లోంచి వస్తున్న రామం కూడా తెల్లబోయారు.

"ఏం చేస్తాం అమ్మగోరూ! బతికున్నాక సూడక, మందిప్పించక తప్పదుగందా!" అంటూ వెళ్ళిపోయింది మంగి.

అప్పుడుగానీ తనన్నమాట ఎంత కఠినంగా ఉందో అర్థంకాలేదు వాసంతికి.

దానికి తోడు రామం కూడా "వసూ! నువ్వు ఒకో

సారి మనుషులు యెంత హర్ట్ అయ్యేలా మాట్లాడతావో గదిలో ఒంటరిగా కూర్చుని ఆలోచించు. మంగి నీ పని మనిషేగానీ. నీ బానిసకాదు. నువ్వసహ్యించుకునే పసివాడికి కన్నతల్లి. ఆడపుటక పుట్టి, అందునా ఇద్దరు బిడ్డల తల్లివై య్యుండి నువ్విలా మాట్లాడావంటే నిజంగా నేను సిగ్గుపడు తున్నాను" పదునుగా అనేసి గదిలోకెళ్ళిపోయాడు.

వాసంతి మొహం అవమానంతోనూ, సిగ్గుతోనూ కందిపోయింది.

* * *

భర్తమాటలో గతం గుర్తొచ్చిన వాసంతి ముఖం చిన్న బోయింది.

నిజమే! వెధవ కాకి గురించి తనింత అరాటపడిందే! కడుపున పుట్టిన బిడ్డను గురించి మంగి అంత ఆరాటపడ్డంలో వింతేముంది?

అసలు తను అంత అసహ్యంగా ఎలా ప్రవర్తించింది? తాను తల్లి అయివుండీ, ఓ మాతృమూర్తి ప్రేమను అంతలా అవమానించిందీ అంటే తన నేదో భూతం ఆవహించి వుండాలి.

కానీ...ఆ భూతం భర్త యిప్పుడు హెచ్చరించేదాకా వదల్లేదా?

కాదు! అహంకారం. 'పనిమనిషి' అన్న చిన్నచూపు! తన పన్లు సవ్యంగా జరగడం లేదన్న చిరాకు.

ఇవన్నీ కలిపి తనని కర్కోటకురాలిగా చేశాయి.

నిజంగా తన ప్రవర్తనకి తాను సిగ్గుపడాలి.

తలుచుకున్నకొద్దీ వాసంతిలో పశ్చాత్తాపం, మంగిమీద ప్రేమ పెరిగిపోతున్నాయి.

ఏమయినా సరే! సిగ్గుపడకుండా తాను ప్రవర్తించిన తీరుకు మంగిని క్షమార్పణ అడగాలి. తను దూరం ఆలోచించక అలా ప్రవర్తించిందనీ, ఆ పసివాడిమీద తనకేమీ పగ లేదనీ, అవసరం అయితే తానే డబ్బు ఖర్చుపెట్టి వాణ్ణి డాక్టర్‌కి చూపిస్తాననీ మంగికి చెప్పాలి." అనుకున్న తరవాత గానీ వాసంతి మనసు శాంతించలేదు.

"అది కుంటికాకి కాదమ్మగోరూ మరేదో కాకి" అని మళ్ళీ అంట్లముందు కూర్చుంది మంగి.

"అవును మంగో! అదిగో ఆ కాకి బతికేవుంది. అవును, ఇంతసేపేం చేశావ్?" అంది వాసంతి నవ్వుతూ.

"పక్కింటి అమ్మగోరు మా అబ్బాయి గురించి అడుగుతుంటే..."

"ఓ! నిజమే మంగీ! వాణ్ణి జాగ్రత్తగా చూసుకో. వెధవ అంట్లకేంలే ఎప్పుడూ వుండేవే! కాస్త ఆలస్యంగా వచ్చినా నేనేం అన్ను. అరె! యేమిటలా చూస్తున్నావ్? నన్ను నమ్మడంలేదుకదూ? సారీ మంగీ నీ విషయంలో నేను చాలా దారుణంగా ప్రవర్తించాను. అందుకు నిజంగా సిగ్గుపడుతున్నాను. కానీ మీ వాడిమీద నాకేం పగలేదు మంగీ" అంది వాసంతి మెల్లగా.

మంగి ఓసారి ఆమె కేసి చూసి భారంగా నిట్టూర్చింది.

"మంగీ! అయ్యగారికి తెలసిన బోన్ స్పెషలిస్ట్ ఒకాయన వచ్చారట. ఆయనకి నీకొడుకుని చూపిద్దాం. ఏమైనా ఫలితం కనిపిస్తుందేమో!" అంది ఉత్సాహంగా వాసంతి.

"ఇంక ఆ అవసరం నేదమ్మా." మంగి గొంతు ఒణికింది.

"అదేం?" తెల్లబోయింది వాసంతి.

"నాబిడ్డ మట్టిలో కల్సిపోయి నా కట్టాలు తప్పించేశాడమ్మా!"

"మంగీ!"

"అవునమ్మగారూ! మీరెల్లిన మర్నాడే ఆడు సచ్చిపోయాడు. ఇంక ఒకటి—నాగా కూడా ఎట్టను. అంట్లు జాగర్తగా తోవుతాను. ఇంటికెల్లాలని తొందరపడను. అన్నిపన్లు మీకు నచ్చేలా చేత్తాను.

ఆ బగమంతుడికి నామీద దయ కలిగిందమ్మా! అందుకే అణ్ణాటికెల్లిపోయాడు. నాకింకా అంతా సుకవేనమ్మా! తంవరన్నట్టు ఆడు సచ్చిపోయి బతికిపోనాడు."

మోకాళ్ళమధ్య తల దూర్చుకుని, దుఃఖాన్నాపుకోవాలని ఎంత ప్రయత్నం చేసినా దుఃఖం ఆగక భోరుమంటున్న మంగిని చూసి కొయ్యబారిపోయి, ప్రతిమలా నిల్చుండిపోయింది వాసంతి.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)